క్లుప్తంగా

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

పోలవరం రూరల్: మండలం ఎల్‌ఎన్‌డీపే టలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఎంపీడీవో జి.శ్రీను, వైద్యాధికారి కె.నిఖిల్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కార్యక్రమాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలకు వచ్చిన నిధులు, ఖర్చులపై ఆరా తీశారు.

17న సర్వసభ్య సమావేశం

జంగారెడ్డిగూడెం రూరల్: ఈ నెల 17న జంగారెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ కొదమ జ్యోతి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరు కావాలని

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం

బుట్టాయగూడెం: మండలంలోని కోర్సవారి గూడేనికి చెందిన పూనెం మల్లేశ్వరరావు అనే గిరిజనుడు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఏలూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు. మల్లేశ్వరరావుకు వైద్య ఖర్చుల నిమిత్తం స్థానిక విద్యా రోహిణీ ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. అదే విధంగా వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కంచెర్ల రామ్మోహన్‌రావు రూ.5000 ఆర్థిక సాయం చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు

తృటిలో తప్పిన ప్రమాదం



జంగారెడ్డిగూడెం ఎస్‌ఈబీ స్టేషన్‌పై విరిగిపడిన చింతచెట్టు

జంగారెడ్డిగూడెం: ఎస్‌ఈబీ అధికారులు, సిబ్బందికి తృటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం సాయంత్రం ఎస్‌ఈబీ స్టేషన్ ఆవరణలో చింత చెట్టు ఒక్కసారిగా విరిగి ఎస్‌ఈబీ స్టేషన్ కార్యాలయ పెంకుటిల్లుపై పడింది. ఆ సమయంలో స్టేషన్‌లో సిబ్బంది విధుల్లో ఉన్నారు. అయితే చెట్టు విరిగిపోతున్న శబ్దాన్ని గమనించి సిబ్బంది బయటకు రావడంతో పెను ప్రమాదం తప్పిందని ఎస్‌ఈబీ సీఐ పట్టాభి చౌదరి తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

చింతలపూడి మండలంలోని శంఖుచక్రపురం, యర్రగుంటపల్లి గ్రామాల్లో విజిలెన్స్, పౌర సరఫరాల శాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకొని, నలుగురిపై 6 (ఎ) కేసులు నమోదు చేసినట్లు డీఎస్‌వో సత్యనారాయణ రాజు తెలిపారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కలిగిస్తున్న ఏవో ముత్యాలరావు

బుట్టాయగూడెం: మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించొచ్చని మండల వ్యవసాయాధికారి డి. ముత్యాలరావు అన్నారు. మండలంలోని పాలకుంటలో మంగళవారం వరిసాగు విధానంపై పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో అవసరం మేరకే రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించాలన్నారు. ప్రకృతిలో లభ్యమయ్యే కషాయాలతో చీడ, పీడలను నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సీహెచ్ కృష్ణ, శ్రీ పసిడి వెలుగు ఆర్‌పీవో గ్రూప్ సభ్యులు ఎం.రాంబాబు, కారం సూర్యచంద్రరావు, బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: విజయదుర్గమ్మ అమ్మవారికి మంగళవారం కదంబ పుష్పాలతో పూజలు నిర్వహించారు. శ్రావణ మంగళవారం సందర్భంగా ఒక భక్తుని ద్వారా సమకూరిన 108 కదంభ పుష్పాలతో అమ్మవారికి కనకధార స్తోత్ర పూజల నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు.

ధైర్యలక్ష్మిగా సౌభాగ్యలక్ష్మి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజ చేసి, మంగళగౌరీ వ్రతాలు ఆచరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ధైర్యలక్ష్మి అలంకరణ చేశారు.

స్వాతంత్ర్యోత్సవ జ్ఞాపకాలు

రజతోత్సవ, స్వర్ణోత్సవ, అమృతోత్సవాలకు గుర్తుగా చిహ్నాలు, శిలా ఫలకాల ఏర్పాటు

కొయ్యలగూడెం: భారతదేశ స్వాతంత్ర్య ఉత్సవాల నేపథ్యంలో ఏజెన్సీకి ముఖద్వారంగా బాసిల్లే కొయ్యలగూడెంలో వివిధ చోట్ల ఏర్పాటు చేసిన చిహ్నాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. 1947 పంద్రాగస్టున స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1972లో అప్పటి పంచాయతీ సమితి కార్యాలయం ఎదుట రజతోత్సవాలను ఘనంగా నిర్వహించి, శిలా ఫలకాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిపై స్వాతంత్ర్య సమరయోధులు దివంగతులైన చంద్రుపట్ల కృష్ణమూర్తి, పెద్దాడ రామచంద్రరావు పేర్లు లిఖించారు. అశోక చక్రంతో అప్పటి రాష్ట్రాలు, జాతీయ చిహ్నం, పక్షి, వృక్షం, క్రీడలకు సంబంధించిన అంశాలతోపాటు స్వాతంత్ర్య ఉద్యమ ఘట్టాలను వివరంగా పొందుపరిచారు. అనంతరం 1997లో స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని శాఖా గ్రంథాలయంలో జాతీయ చిహ్నమైన నాలుగు సింహాల స్తూపాన్ని మిత్ర యూత్‌కు చెందిన యువకులు ఆదర్శంగా నెలకొల్పారు. 2022లో స్వాతంత్ర్యం సాధించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో రజతోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని పోలిన విధంగానే అమృత్ మహోత్సవ శిలా ఫలకాన్ని ఏర్పాటు చేశారు.



కొయ్యలగూడెంలో రజతోత్స, స్వర్ణోత్సవ, అమృతోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన శిలా ఫలకాలు, జాతీయ చిహ్నం

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

జంగారెడ్డిగూడెం: యువత మాదక ద్రవ్యాల జోలికి పోకుండా వారి భవిష్యత్తును ఉజ్వలం చేసుకోవాలని జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి మంగళవారం డ్రగ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజేష్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థులు భుజ స్కంధాలపై ఉందన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగం నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ పర్యవేక్షణలో జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణకు 14500 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశామని, సమాచారం తెలియజేయాలన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, జంగారెడ్డిగూడెం పోలీస్, ట్రాఫిక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ రాజేష్

రెండో రోజూ శిక్షణ తరగతులు

పోలవరం రూరల్: పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో రెండో రోజు మంగళవారం ప్రగఢపల్లి, ఎల్‌ఎన్‌డీపేట పంచాయతీల పరిధిలోని వర్మికంపోస్టు యార్డులను పరిశీలించారు. వర్మికంపోస్టు తయారీ, వాటి వల్ల ప్రయోజనాలపై రిసోర్స్ పర్సన్ రాజేశ్వరరావు సర్పంచ్‌లు, కార్యదర్శులకు వివరించారు. గ్రామ పంచాయతీల్లో చేపట్టే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు వర్మికంపోస్టు తయారు చేసే విధానం వివరించారు. ఎంపీడీవో జి.శ్రీను, సర్పంచ్‌లకు, కార్యదర్శులకు పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. అనంతరం రేపల్లెవాడ గ్రామంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, సర్పంచ్‌లు మైగాపుల విజయదుర్గ, ఎస్.శ్రీరామమూర్తి, పొడుంపుష్ప, సున్నం చంద్రమ్మ, కె.వెంకటలక్ష్మి, కోటం గంగాదేవి, జారం సీతారామలక్ష్మి, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎల్‌ఎన్‌డీపేటలో వర్మికంపోస్టు యార్డును పరిశీలిస్తున్న సర్పంచ్‌లు, కార్యదర్శులు

దేవులపల్లిలో శిక్షణ కార్యక్రమం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని దేవులపల్లిలో జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం, వర్మీ కంపోస్టు తయారీ, వర్మీ కంపోస్టు మార్కెటింగ్ వంటి అంశాలపై ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. మండలంలోని క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

జంగారెడ్డిగూడెం రూరల్: ఉచిత మెగా వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీల చాంబర్ అధ్యక్షుడు, జంగారెడ్డిగూడెం జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. మండలంలోని వేగవరంలో మంగళవారం వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి లక్కాబత్తుల వెంకట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన బాబ్జి మాట్లాడుతూ పేద ప్రజలకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పార్టీ తరపున పేదల ఆరోగ్యం కోసం వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఆరోగ్య శ్రీ పథకంలో పేద ప్రజల ఆరోగ్యం కోసం కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిన వెంకట్‌ను బాబ్జి అభినందించారు. వైద్య శిబిరంలో జంగారెడ్డిగూడెం సాయి స్ఫూర్తి ఆసుపత్రి వైద్యులు సేవలందించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయి స్ఫూర్తి ఆసుపత్రి డైరెక్టర్ వాసిరెడ్డి శ్రీనివాస్, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ సోనిక, జనరల్ మెడిసిన్ వైద్యులు రామకృష్ణ, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోగులకు మందులు అందజేస్తున్న జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ అధ్యక్షుడు బాబ్జి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కొయ్యలగూడెం: కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ మండల కన్వీనర్ జమ్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం కన్నాపురం రోడ్డులో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన వెంటనే నల్లధనాన్ని వెలికి తీసి పేద ప్రజల బ్యాంక్ ఖాతాలలో జమ చేస్తామని చెప్పిందని, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా జమ చేసిన దాఖలాలు లేవన్నారు. యువతకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, ఇంత వరకు ఆ ఊసే లేదని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. రైతులు నష్టపోయి ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. కార్పొరేట్ శక్తులకు 14 లక్షల 56 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేశారని, రైతులకు మాత్రం ఎటువంటి రుణమాఫీలు చేయలేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికై అనేక పోరాటాలు చేసిన పార్టీ సీపీఐ అని ఆయన తెలిపారు. పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం ధారయ్య, మండల సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్‌కే బాజీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణ చైతన్య

ఘనంగా ఇంటర్నేషనల్ లెఫ్ట్ హ్యాండర్స్ డే

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ×ఇంటర్నేషనల్ లెఫ్ట్ హ్యాండర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. లెఫ్ట్ హ్యాండర్ అయిన ప్రతిభ అకడమిక్ డైరెక్టర్ సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎంతోమంది మేధావులు ఎడమ చేతి వాటం వారని తెలియజేశారు. ఒబామా, బిల్ గేట్స్, మన ప్రధాని మోదీ, లియోనార్డో డావిన్సీ, అరిస్టాటిల్, సచిన్ టెండుల్కర్, అమితాబ్ బచ్చన్, రతన్ టాటా, మదర్ తెరిసా, చార్లీ చాప్లిన్, రజినీకాంత్ వంటి ఎందరో ప్రముఖులు ఎడమ చేతి వాటం వారేనని తెలిపారు. విజయవాడలో జరిగిన నేషనల్ కుంగ్ ఫూ, కరాటే పోటీలో స్టేట్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్న ఏడో తరగతి విద్యార్థిని వర్షిణిని అభినందించారు. సరోజా రెడ్డి, సింధూషా రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



లెఫ్ట్ హ్యాండర్స్ డేలో పాల్గొన్న విద్యార్థులు

మద్ది క్షేత్రంలో భక్తుల కిటకిట

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామిని మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు గర్భగుడిలోని మూల విరాట్ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ మూర్తిని మండపం వద్దకు మేళ తాళాలతో తీసుకొచ్చారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆదాయం రూ.1,47,978 వచ్చిందని, 1200 మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ప్రగడవరానికి చెందిన చింతా విష్ణుమూర్తి కుటుంబ సభ్యులు 36 కుర్చీలను ఆలయానికి అందజేశారని ఈవో తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పాల్గొన్నారు.



ఉత్సవ మూర్తిని మేళతాళాలతో మండపం వద్దకు తీసుకొస్తున్న దృశ్యం

ఏడుగురిపై దౌర్జన్యం కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఒక వ్యక్తిపై దౌర్జన్యం చేసి, కొట్టి గాయపర్చిన నేరంలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు. పంగిడిగూడేనికి చెందిన మానుకొండ శ్రీను వద్ద ద్వారకా తిరుమల మండలం సత్తెన్నగూడేనికి చెందిన పెండెం నాగరాజు చేబదులుగా రూ.30 వేలు తీసుకున్నాడు. ఈ నెల 11న శ్రీను తన కుమార్తె వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. అప్పటికే శ్రీను ఇంటి వద్దే ఉన్న నాగరాజును చూసి శ్రీను డబ్బులు అడిగాడు. దీంతో నాగరాజు డబ్బులు లేవని చెబుతూ శ్రీనును దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేశాడు. నాగరాజు వెంట వచ్చిన మరో ఆరుగురితో కలిసి శ్రీనుపై దాడి చేయడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో నాగరాజు, మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లారీని ఢీకొని వ్యక్తి మృతి

కొయ్యలగూడెం: ఆగి ఉన్న లారీని ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం జాతీయ ప్రధాన రహదారిపై బ్రహ్మల కాలనీ సమీపంలో ప్రమాదం సంభవించింది. కొయ్యలగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వైపు ఆటోతో వస్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. దీంతో మజ్ను అక్కడికక్కడే మృతి చెందాడు. కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని ముబారక్ రెస్టారెంట్లలో ఇతడు పని చేస్తున్నట్లు తెలిసింది. కొయ్యలగూడెం ముబారక్ రెస్టారెంట్‌కు వచ్చి సరుకు దిగుమతి చేసి, జంగారెడ్డిగూడెం తిరిగి వెళుతుండగా ప్రమాదం సంభవించింది. మృతుడి స్వస్థలం విజయవాడని ముబారక్ యాజమాని తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కుక్కునూరు: మండలంలోని దామరచర్ల వద్ద మంగళవారం గోదావరి నదిలో చెట్టు కొమ్మకు వేలాడుతున్న గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్టు కుక్కునూరు ఎస్సై రామకృష్ణ తెలిపారు. పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారన్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉందన్నారు. మెడలో నల్ల పూసల దండ ఉందన్నారు. గుర్తుల ఆధారంగా వివరాలు తెలిస్తే కుక్కునూరు పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని లేదా ఫోన్ నెంబర్ 7382623699కు కాల్ చేయాలని సూచించారు.

బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ

కొయ్యలగూడెం: బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, ఫోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాలు ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పొంగుటూరు సెక్టార్ పరిధిలోని గవరవరంలో సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో అంగన్‌వాడి కేంద్రాలలో సమావేశాలు నిర్వహించారు. బాల్య వివాహ వ్యవస్థ వలన ఏర్పడే దుష్పరిణామాల గురించి వివరించారు. అదే విధంగా ఫోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పౌష్టికాహార విధానం గురించి తెలిపారు. తల్లిపాలు బిడ్డలకు పట్టడం పట్ల క్రమేపీ చైతన్యం వస్తోందని, ఇది మంచి పరిణామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే అరుణ కుమారి, జీవీవీ నాగమణి, కె.నాగ కుమారి, సీహెచ్ పాప, కె.సుజాత, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

గిరిజనుల శ్రమదానం

బుట్టాయగూడెం: ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూడకుండా తమ గ్రామాలకు వెళ్లే రహదారి వర్షాలకు కొట్టుకుపోవడంతో ఆ రోడ్డును గిరిజనులే శ్రమదానం చేసి బాగు చేసుకున్నారు. వర్షాలకు రహదారి పాడైపోయిందని చెప్పినప్పటికీ ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో రెడ్డిబొడ్డేరు, చింతకొండ, గొట్టాలరేవు, పూచికగొందిలకు చెందిన గిరిజనులు రోడ్డును మరమ్మతులు చేసుకున్నారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కారం రాఘవ మాట్లాడుతూ వర్షాలకు రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో కనీసం ద్విచక్ర వాహనాలు సైతం తిరగని పరిస్థితి నెలకొందన్నారు. అనారోగ్యం బారిన పడిన వారు, పిల్లలు, గర్భిణులు ఈ రహదారులపై ప్రయాణం చేయలేక పలు అవస్థలు పడుతున్న నేపథ్యంలో గ్రామస్తులే శ్రమదానం చేయడం అభినందనీయమన్నారు. అయితే పనులు మానుకొని మరీ రహదారి మరమ్మతు పనులు చేపట్టిన గిరిజనులకు ఐటీడీఏ ద్వారా రోజువారీ వేతనం ఇప్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కెచ్చెల పోతురెడ్డి, కట్టం నాగేశ్వరరావు, కెచ్చెల గంగరాజు, కారం వెంకన్న, పట్ల ముక్కారెడ్డి, గోగుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న గిరిజనులు

పోస్టుల భర్తీలో రజకులకు న్యాయం చేయాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీలో రజకులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా రజక జన సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నామినేటెడ్ పోస్టులైన ఏఎంసీ చైర్మన్, ఫెడరేషన్ చైర్మన్, డైరెక్టర్స్, గ్రంథాలయ చైర్మన్ తదితర వాటిలో రజకులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. రజకుల సంక్షేమానికి అనేక జీఓలు ఇచ్చినప్పటికీ రాష్ట్రంలో 70 శాతం గ్రామాలకు వృత్తి చెరువులను కేటాయించకపోవడం, అధికారులు గ్రామ పంచాయతీల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో రజకుల దోబీ ఘాట్‌ల నిర్మాణానికి నిధులు కేటాయించినప్పటికీ క్షేత్ర స్థాయిలో అవి కార్యరూపం దాల్చలేదని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు బడ్జెట్‌లో దోబి గాట్స్‌కు రూ.10 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చింతలపూడి రజక కమ్యూనిటీ హాలుకు రూ.10 లక్షలు, కొయ్యలగూడెం మండలం బయ్యన్నగూడెం గ్రామంలో రూ.50 లక్షలు మంజూరు చేశారని, ఆ నిధులు విడుదల చేసి రజక వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పగడాల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రజక సంఘం అధ్యక్షుడు కట్లయ్య

హెడ్‌పోస్టాఫీసులో జాతీయ జెండాలు



డీఎస్పీ రవిచంద్రకు జెండాను అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. మంగళవారం పోస్టల్ సిబ్బంది డీఎస్పీ యు.రవిచంద్రను మర్యాపూర్వకంగా కలిసి జాతీయ జెండాను అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతీ ఇంటిపైన జాతీయ జెండా ఎగుర వేయాలనే ఉద్దేశ్యంతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించామన్నారు. జాతీయ జెండాను రూ.25కు హెడ్‌పోస్టాఫీసులో అందుబాటులో ఉంటాయన్నారు. జంగారెడ్డిగూడెం హెడ్‌పోస్టాఫీసు పరిధిలో తొలి జెండాను తాను కొనుగోలు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యి హర్ ఘర్ తిరంగాను విజయవంతం చేయాలని కోరారు. జంగారెడ్డిగూడెం ప్రధాన తపాలా అధికారి జి.గంగాధర్, డీఎస్పీ కార్యాలయ ఏఎస్‌ఐ సోంబాబు, ఎ.రామాంజనేయులు, డి.వెంకట్, కె.వెంకట్, కె.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



వెయ్యి అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

1000 అడుగుల తిరంగా ర్యాలీ

కొయ్యలగూడెం: పంద్రాగస్టు పర్వదినం పురస్కరించుకొని మంగళవారం కొయ్యలగూడెంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు వెయ్యి అడుగుల త్రివర్ణ పతాకంతో భారీ ర్యాలీ చేపట్టారు. జాతీయ ప్రధాన రహదారితో పాటు కన్నాపురం, తాడేపల్లిగూడెం రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తూ భారతమాతకు జేజేలు పలుకుతూ దేశ నాయకులకు జోహార్లు అర్పించారు. అఖిల పక్ష రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు పాల్గొన్నారు.